

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి గౌనబోయిన వేణుగోపాలరావు దంపతులు (గరగపర్రు, కోనసీమ) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



అయినవిల్లిలో..

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి వరద కమలాకర్, అపర్ణ దంపతులు (విశాఖపట్నం) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

డెల్టాలకు 14,400 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం తూర్పు డెల్టాకు 5 వేలు, మధ్య డెల్టాకు 2,700, పశ్చిమ డెల్టాకు 6,700 కలిపి మొత్తం 14,400 క్యూసెక్కుల గోదావరి జలాలు విడుదల చేశారు. సముద్రంలోకి 49,422 క్యూసెక్కులు విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

బకాయి వేతనాలు ఇవ్వరూ

ఎంటీఎస్ ఉపాధ్యాయుల ఆవేదన

అమలాపురం టౌన్: జీతాలు ఇచ్చి ఆదుకోవాలని జిల్లాలోని 122 మంది డీఎస్సీ–98 మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ఉపాధ్యాయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. గత మే, జూన్ నెలలకు జీతాలు వేయలేదని, ఇప్పుడు జూలై నెల గడిచిపోతున్నా జీతాలు పడే సూచనలు కనిపించడం లేదని వారు వాపోతున్నారు. ఈ మేరకు జిల్లా ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ కేశవకుమార్ అమలాపురంలో ఆదివారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో కూడా తమకు అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

తమ సమస్యలపై కాకినాడలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల నియోజకవర్గం ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరానికి వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. తమ ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని, 12 నెలలూ జీతాలు ఇవ్వాలని ఆ వినతి పత్రాల్లో ఏకరువు పెట్టుకున్నామన్నారు. డీఎస్సీ–25 కౌన్సెలింగ్‌కు ముందు ఎంటీఎస్ ఉపాధ్యాయులకు మరోసారి కౌన్సెలింగ్ నిర్వహించి సమీప మండలాల్లో పోస్టింగులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెలకు కేవలం రూ.32,470 జీతాలు అందుకుంటున్న తమను 150 కిలో మీటర్లకు పైగా దూరంలో ఉన్న, అదీ ఏకోపాధ్యాయ పాఠశాలలకు బదిలీలు చేయడం ఎంత వరకూ సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్ గోదావరి భవన్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తారన్నారు. అర్జీదారులు 1100 కాల్ సెంటర్ ద్వారా తమ ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చునన్నారు. ఈ వేదికను మూడు రెవెన్యూ డివిజన్లు, 22 మండల కేంద్రాలు, 4 మున్సిపల్ కార్యాలయాలలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా అధ్యయనోత్సవాలు



ప్రదక్షిణ పూర్వక అధ్యయనోత్సవాలు నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి ఆలయంలో ఐదు రోజులు జరిగే అధ్యయనోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా ప్రదక్షిణ పూర్వకంగా అధ్యయనోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ద్రావిడ వేద పారాయణం ద్వారా స్వామి వారి తేజస్సు ఉత్పన్నం అవ్వడంతో పాటు దేవాలయంలో నిత్య కైంకర్యాల్లో జరిగే లోపాల నివారణకు ఈ అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారని వేద పండితులు పేర్కొన్నారు. ఆలయ ఉప ముఖ్య అర్చక స్వామి గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో కె.కృష్ణమాచార్యులు, ఎస్‌టీపీ రామానుజాచార్యులు, సీవీఎస్ సాయిరామ్, ఎస్.వెంకటాచార్యులు సేవాకాలం నిర్వహించారు.



భారీ గోతుల్లో వర్షపు నీరు చేరి అధ్వానంగా ఉన్న అమలాపురం బైపాస్ రోడ్డు



కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారుతున్న అమలాపురం బైపాస్ రోడ్డు

అడుగుకో మడుగు!

- అధ్వానంగా అమలాపురం బైపాస్ రోడ్డు
- అసౌకర్యంగా మారిన నల్లవంతెన–ఎర్రవంతెన బైపాస్
- ప్రమాదాలకు కారణమవుతున్న రహదారులు
- పట్టించుకోని అధికారులు

అమలాపురం టౌన్: అధికారమిస్తే ఏడాదిలో అందమైన రహదారులు వేసేస్తామన్న కూటమి నాయకులు రెండో ఏడు సమీపిస్తున్నా ఆ మాట దక్కించుకోలేకపోయారు. అడుగుకో గొయ్యి, గజానికో గతుకు అన్నట్లుగా అమలాపురం బైపాస్ రోడ్డు అధ్వానంగా తయారైంది. అమలాపురం పట్టణం నల్లవంతెన నుంచి ఎర్ర వంతెన వరకూ పదిమ్నీపేట, హౌసింగ్ బోర్డు కాలనీ వైపు నిర్మించిన పట్టణ బైపాస్ రోడ్డు నేడు పూర్తిగా పాడైపోయింది. ఆ రోడ్డు మీదుగా వెళ్తున్న వాహనాలు అలలపై ఊగే నావల్లా ఊగుతూ, తూలుతూ అతి కష్టంగా ముందుకు సాగుతున్నాయి. కిలోమీటరు పొడవున ఉన్న ఈ రహదారిని 2015లో రూ.11 కోట్ల వ్యయంతో ఈ రెండు వంతెనల మధ్య పంట కాలువకు రిటైనింగ్ వాల్, రోడ్డు నిర్మించారు. అప్పట్లోనే ఓఎన్జీసీ ఈ రహదారిని నిర్మించింది. నాసిరకం సామగ్రిని వినియోగించడంతో నిర్మాణం పూర్తయిన ఏడాదికే నాణ్యతా లోపాలు ఒక్కొక్కటిగా బయటపడ్డాయి. నేడు ఆ రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. ఈ బైపాస్ రోడ్డుపై నుంచి ఓఎన్జీసీ భారీ వాహనాలు అధికంగా వెళతాయి. అప్పట్లో రోడ్డు నిర్మాణాన్ని ఆ సంస్థ ఇంజినీర్లే పర్యవేక్షించారు. ఇదే బైపాస్ రోడ్డులో అప్పటి డిప్యూటీ సీఎం, హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఇల్లు కూడా ఉంది. అప్పట్లో ఆయన కనుసన్నల్లో ఆయన బంధువులే ఈ రహదారి నిర్మాణానికి కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. నిర్మించిన ఏడాదికే నాణ్యతా లోపాలు బయటపడుతున్నా చినరాజప్ప నాడు డిప్యూటీ సీఎం కావడంతో ఎవరూ నోరు మెదపలేదు.



ఉప్పలగుప్తం మండలం పెదగాడవిల్లి నుంచి కాట్రేనికోన మండలం ఉప్పూడి వెళ్లే రహదారి దుస్థితి

రూ.3.5 కోట్లతో ఈదరపల్లి బైపాస్ పటిష్టత

అమలాపురం ఈదరపల్లి వంతెన నుంచి నల్ల వంతెన వరకూ కిలోమీటరు మేర, నల్ల వంతెన నుంచి ఎర్ర వంతెన వరకూ మరో కిలోమీటరు మేర బైపాస్ రోడ్డు విస్తరించి ఉంది. 2000 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఈ బైపాస్ రోడ్డు నిర్మించడంతో ఏడాదిన్నరకే అది ఛిద్రమైంది. అప్పట్లో రెండేళ్లకే ఈ బైపాస్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. నాటి నుంచి 2020 వరకూ ఈ బైపాస్ రోడ్డు అంటే అధ్వానానికి నమూనాగా ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంత్రి పినిపే విశ్వరూప్ కృషితో ఈదరపల్లి–నల్ల వంతెన వరకూ రూ.3.5 కోట్లతో ఆర్ అండ్ బీ శాఖ ప్రమాణాలతో సీసీ రోడ్డు నిర్మించడంతో బైపాస్ రోడ్డు కష్టాలు సగం తీరాయి. అప్పటి వరకూ బ్లాక్ టాప్ (బీటీ) రోడ్డుగా ఉన్న ఈ బైపాస్‌ను సువిశాలంగా సీసీ రోడ్డుగా నిర్మించారు. ఇదే సమయంలో నల్ల వంతెన – ఎర్ర వంతెనల మధ్య ఉన్న బైపాస్ రోడ్డుకు మరమ్మతులు జరిగాయి. పూర్తిగా అధ్వాన స్థితికి చేరిన ఈ బైపాస్ రోడ్డుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే మరమ్మతులు జరగడంతో వాహన చోదకులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు.

కూటమి వచ్చి ఏడాది దాటుతున్నా..

నల్లవంతెన – ఎర్ర వంతెన బైపాస్ రోడ్డు పెద్ద పెద్ద గోతులతో పూర్తి శిథిలావస్థకు చేరుకున్నా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇంతటి కీలకమైన రహదారి దుస్థితిపై దృష్టి పెట్టలేకపోతోంది. అధికారంలోకి వస్తే ఏడాదిలో బాగుచేసేస్తామన్న కూటమి నేతలు ఆ తరువాత ఆ మాటే మరచారు. సాధారణ పరిస్థితుల్లోనే బైపాస్ రోడ్డులో ఉన్న పెద్దపెద్ద గోతులతో దీనిపై ప్రయాణం అంటే అవస్థలతో సాగుతోంది. ఇక వర్షం వచ్చిందంటే ఆ గోతుల్లో రోజుల తరబడి నీరు నిలిచిపోయి బురదమయమై, చిత్తడిగా మారి ఎప్పుడు ఎవరు పడిపోయి ప్రమాదానికి గురవుతారో అన్నంత భయంకరంగా తయారైంది. ఈ బైపాస్ రోడ్డులోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు నివాసం ఉంది. ఆయన కూడా ఈ బైపాస్ నుంచి కాకుండా వేరే మార్గంలో వెళతారు తప్ప చమురు సంస్థలతో ఈ రోడ్డు నిర్మించేందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బైపాస్ రోడ్డును తక్షణం బాగు చేయాలి



అమలాపురం నల్ల వంతెన–ఎర్ర వంతెన మధ్య శిథిలావస్థకు చేరిన బైపాస్ రోడ్డును తక్షణమే బాగు చేయాలి. భారీ వాహనాలు తప్ప మిగిలిన వాహనాలు ఈ రోడ్డు మీదుగా వెళ్లాలంటే నరకంలా భావిస్తున్నారు. అటు ప్రజాప్రతినిధులు, ఇటు ఓఎన్జీసీ అధికారులు ఈ రోడ్డు ఆధునీకరణపై తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలి. ఇప్పటికే పెద్ద పెద్ద గోతులతో వాహనాలు వెళ్లేందుకు తీవ్ర అసౌకర్యంగా ఉన్న రోడ్డును ఇప్పుడు బాగు చేయకపోతే ఇక ముందు కురిసే వర్షాలకు మరింత దెబ్బ తింటుంది.

– యల్లమిల్లి నాగ సుధా కొండ, అధ్యక్షుడు, ఆజాద్ ఫౌండేషన్, అమలాపురం

ఎన్నాళ్లీ నరకం?



అమలాపురం పట్టణం నల్ల వంతెన–ఎర్ర వంతెన మధ్య ఉన్న బైపాస్ రహదారిపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. 2014 నుంచి ఈ బైపాస్ రోడ్డు అధ్వానంగానే ఉంది. మధ్యలో రూ.11 కోట్లతో బైపాస్ రోడ్డు, దాని చెంత కాల్వకు రిటైనింగ్ వాల్ నిర్మాణంతో కష్టాలు తీరుతాయనుకున్నాం. రహదారి నిర్మించిన ఏడాది నుంచే నాణ్యతా లోపాలు బయటపడ్డాయి. నాటి నుంచి నేటి దాకా బైపాస్ రోడ్డును ఆధునీకరించిన దాఖలాల లేవు. 2019–24 మధ్య వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆ బైపాస్ రోడ్డుకు కనీసం మరమ్మతులైనా చేపట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కనీస మరమ్మతులు లేవు.

– కముజు రమణ, సావరం, అమలాపురం

బోధనేతర పనులతో మానసిక ఒత్తిడి

ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, ఫ్యాప్టో చైర్మన్ సాయి శ్రీనివాస్

అమలాపురం టౌన్: ఈ విద్యా సంవత్సరం నుంచి ఉపాధ్యాయులపై పనుల భారం ఉండదన్న ఉన్నతాధికారులు ఆచరణలో తగిన చర్యలు తీసుకోలేకపోతున్నారని రాష్ట్ర ఎస్‌టీయూ అధ్యక్షుడు, ఫ్యాప్టో చైర్మన్ లంకలపల్లి సాయి శ్రీనివాస్ అన్నారు. బోధనేతర పనులతో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమలాపురంలోని ఎస్టీయూ విద్యా భవన్‌లో జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అధ్యక్షతన ఆదివారం జరిగిన జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశానికి సాయి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగించాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. బోధనేతర పనుల ఒత్తిడి ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తుందో ప్రభుత్వ పెద్దలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. తల్లికి వందనం పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇలా చేయడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గదని ఆయన అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 13 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకూ 12వ పీఆర్సీ ఏర్పాటు, మధ్యంతర భృతి మంజూరు, సీపీఎస్ రద్దుపై సానుకూల నిర్ణయం ప్రకటించపోవడం దారుణమన్నారు. 11వ పీఆర్సీ బకాయిల చెల్లింపు కోసం రోడ్ మ్యాప్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్య పల్లంరాజు కార్యదర్శి నివేదిక సమావేశంలో సమర్పించారు. ఎస్‌టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి నేరేడుమిల్లి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివ ప్రసాద్, ఉపాధ్యక్షుడు చొప్పల రాంబాబు, ఉపాధ్యాయ వాణి కన్వీనర్ చిక్కం మైనర్‌బాబు, జిల్లా మహిళా కార్యదర్శి మునగాల భవాని, రాష్ట్ర కన్వీనర్లు వాసంశెట్టి వెంకటేశ్వరరావు, సీహెచ్ ఉమాపతి శాస్త్రి తదితరులు సమావేశంలో ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్‌టీయూ అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

ముద్రగడ త్వరగా కోలుకోవాలి

ఉద్యమ నేతకు నాయకుల పలకరింపు

సాక్షి ప్రతినిధి, కాకినాడ/కొత్తపేట: అస్వస్థతకు గురై, కాకినాడ మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభాన్ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వివిధ పార్టీల నేతలు ఆదివారం పలకరించి ధైర్యం చెప్పారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పద్మనాభం ఆరోగ్య పరిస్థితిని ఆయన కుమారుడు, పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును ఫోనులో అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎంపీ, పిఠాపురం కో ఆర్డినేటర్ వంగా గీత, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పలకరించారు. గిరిబాబును కలిసి ధైర్యం చెప్పారు. మాజీ మంత్రి, పార్టీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పెద్దాపురం కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కాపు జేఏసీ నాయకులు తోట రామకృష్ణ, కల్వకొలను తాతాజీ, వాసిరెడ్డి ఏసుదాసు, కైట్ విద్యా సంస్థల చైర్మన్ పోతుల విశ్వం, తోట సుబ్బారావు నాయుడు, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్ములమడక నాగమణి, మాలమహానాడు అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్, రామిశెట్టి బులిరామకృష్ణ తదితరులు గిరిబాబుతో మాట్లాడి ముద్రగడ ఆరోగ్యంపై ఆరా తీశారు. పద్మనాభం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



కాకినాడలో ముద్రగడ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి

ముద్రగడ ఆరోగ్యం బాగానే ఉంది

జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి

ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం బాగానే ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. కాకినాడలో ముద్రగడ చికిత్స పొందుతున్న మెడికవర్ ఆస్పత్రికి వెళ్లి, తండ్రి వద్దే ఉండి ఆయన బాగోగులు చూసుకుంటున్న గిరిని జగ్గిరెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పద్మనాభం ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం బాగానే ఉందని, ఇప్పుడే మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పద్మనాభం కుమారుడు గిరితో ఫోన్లో మాట్లాడి పెద్దాయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారని తెలిపారు. అలాగే ఏ విధమైన ఇబ్బంది వచ్చినా మెరుగైన వైద్యం కోసం ఎక్కడికైనా ఎయిర్ లిఫ్ట్ చేయడానికి సిద్ధంగా ఉండాలని జగన్ ఆదేశించారని తెలిపారు.

విషయం లేని బోధనలేల?

- సర్కారు బడుల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా లేని వైనం
- డీఎస్సీ నియామకాల వరకు సర్దుబాట్లు లేనట్టే!



విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయిని

రాయవరం: మండలం వి.సావరం ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 8 తరగతులు ఉన్నాయి. విద్యార్థులు 69 మంది ఉన్నారు. 1 నుంచి 5 తరగతుల వరకు 24 మంది విద్యార్థులు ఉండగా, ఇద్దరు ఎస్‌జీటీలు ఉన్నారు. 6 నుంచి 8 తరగతుల వరకు 45 మంది విద్యార్థులు ఉండగా వారికి నాలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉండాలి. కాని ఇప్పుడు ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లతో మూడు తరగతులకు బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. మరో ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లను ఈ పాఠశాలలో నియమించాల్సి ఉంది. ఇంగ్లిషు, గణితం బోధించే ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. మిగిలిన సబ్జెక్టులు బోధించే వారు లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

మండపేట పట్టణంలోని ఎస్ఎస్‌వీవీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 280 మంది విద్యార్థులున్నారు. తెలుగు, హిందీకి బోధకులు లేరు. ఈ సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు బదిలీపై శ్రీగౌతమి మున్సిపల్ ఉన్నత పాఠశాల నుంచి వచ్చినప్పటికీ ఆ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక పోవడంతో వారిని అక్కడ రిలీవ్ చేయలేదు.

ఇక గొల్లపుంతకాలనీలో అప్‌గ్రేడ్ అయిన మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏడు సబ్జెక్టు పోస్టులు మంజూరై ఉండగా, ప్రస్తుతం కేవలం ఇద్దరు మాత్రమే పని చేస్తున్నారు. 6 నుంచి 8 తరగతలకు 90 మంది విద్యార్థులుండగా, కేవలం ఇద్దరు సబ్జెక్టు ఉపాధ్యాయులు మాత్రమే బోధించడం వారికి కత్తిమీద సాములా ఉంది. అలాగే జిల్లాలో పలు మండలాల్లో పదుల సంఖ్యలో సింగిల్ టీచర్ స్కూల్స్ ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఇక్కడ అత్యవసర పరిస్థితుల్లో ఉపాధ్యాయులు సెలవు పెడితే పని కేటాయించడం అక్కడి ఎంఈఓలకు తలకు మించిన భారమవుతోంది.

ఎందుకీ పరిస్థితి?

ఉమ్మడి జిల్లా పరిధిలో చేపట్టిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ జూన్ 15తో ముగిసింది. బదిలీకి గురైన ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో వారు కోరుకున్న స్థానాల్లో విధుల్లో చేరలేకపోయారు. రిలీవర్ లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. డీఎస్సీ–2025 ఉపాధ్యాయులు నియామకమైతేనే బదిలీ అయిన ఉపాధ్యాయుల రిలీవ్‌కు ఆస్కారం ఉంది. డీఎస్సీ–2025 పరీక్షలు జూలై 2తో ముగిసినప్పటికీ నేటి వరకు ఫలితాలు విడుదల కాలేదు. ఒక వైపు విద్యా సంవత్సరం జూన్ 12న ప్రారంభం కాగా, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఆగస్టు 4 నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతతో ప్రధానోపాధ్యాయుల్లో అయోమయం నెలకొంది. ప్రస్తుతానికి పాఠశాలల్లో ఉన్న సబ్జెక్టు ఉపాధ్యాయులు వారి సబ్జెక్టులను బోధించడానికి రోజుకు ఆరు నుంచి ఏడు పీరియడ్లు బోధించాల్సి వస్తోంది. మిగిలిన సబ్జెక్టులను సైతం చెప్పాల్సి రావడం వారికి అదనపు భారమవుతోంది. మిగిలిన సబ్జెక్టులు ఎలాగోలా నెట్టుకొస్తున్నప్పటికీ హిందీ విషయంలో ఇబ్బంది ఉన్నట్టు హెచ్ఎంలు చెప్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లు లేకపోవడంతో పలు సందర్భాల్లో అన్ని తరగతుల విద్యార్థులను ఒకేచోట కూర్చోబెట్టి పాఠాలు చెప్తున్నారు. ఈ గందరగోళ పరిస్థితులతో విద్యార్థులు చదువులో వెనకబడుతున్నారు.

సర్దుబాటు లేనట్టేనా?

ఆగస్టులో డీఎస్సీ ఫలితాలు ప్రకటించి, నియామక పత్రాలు అందిస్తామన్న ప్రభుత్వం కిమ్మనకుండా ఉంది. ఆ నియామకాలు చేపడితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,248 పోస్టులు భర్తీ కానున్నాయి. ఈ లోగా కనీసం మిగులు ఉపాధ్యాయులను అవసరమైన చోటకు తాత్కాలికంగా సర్దుబాటు చేయాల్సి ఉంది. గత విద్యా సంవత్సరంలో 420 మంది టీచర్లను అవసరం ఉన్న పాఠశాలకు సర్దుబాటు చేశారు. జూన్ నెలలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 75 మంది వరకు ఉద్యోగ విరమణ పొందారు. జూలై నెలలో కూడా ఉద్యోగ విరమణ చేసే వారి సంఖ్య అధికంగా ఉన్నట్లు సమాచారం.

తక్షణం పోస్టులు భర్తీ చేయాలి



ప్రభుత్వం తక్షణం ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేయాలి. అప్పటి వరకు కనీసం సర్దుబాటైనా చేయాలి. చాలా పాఠశాలలు సింగిల్ టీచర్ స్కూల్స్‌గా మారిపోయాయి. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది.

– పి.సురేంద్రకుమార్, జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్, కోనసీమ జిల్లా

విద్యా ప్రమాణాలు సాధించేదెలా?



ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తుంటే విద్యా ప్రమాణాలు సాధించేదెలా? బోధనేతర పనులను ఉపాధ్యాయులపై రుద్దుతున్నారు. రికార్డులే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోంది తప్ప, విద్యా ప్రమాణాలను పట్టించుకోవడం లేదు. తప్పును ఉపాధ్యాయులపై నెట్టే ప్రయత్నం చేస్తోంది.

– పోతంశెట్టి దొరబాబు, జిల్లా అధ్యక్షుడు, ఎస్‌టీయు, అమలాపురం

ఇబ్బంది కలగకుండా చర్యలు



ఉపాధ్యాయుల కొరత ఉన్నది వాస్తవమే. బోధన కుంటుపడకుండా, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నాం. అవసరమైన మేరకు సబ్జెక్టు ఉపాధ్యాయుల సర్దుబాటుకు చర్యలు తీసుకుంటున్నాం. సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలపై ప్రభావం పడకుండా చూస్తున్నాం.

– డాక్టర్ షేక్ సలీం బాషా, డీఈఓ, కోనసీమ జిల్లా



అమ్మలగన్న పెద్దమ్మకు సారె



వానపల్లిలో పళ్లాలమ్మకు..

కొత్తపేట: వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మకు గ్రామస్తులు ఆదివారం ఆషాఢం సారె సమర్పించారు. ఆలయ ఈఓ భాగవతుల వెంకటరమణ మూర్తి ఆధ్వర్యంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆత్రేయపురం మండలం ర్యాలిలో 2 వేల మంది మహిళలు వాగ్దేవి నగర మహాలక్ష్మి (వాకులమ్మ)తో పాటు 40 మంది దేవతలకు చీర, సారె సమర్పించారు.



క్లుప్తంగా

వృద్ధురాలి ఆత్మహత్య

రాయవరం: మండలం మాచవరం గ్రామం సమీపంలోని మండపేట కెనాల్‌లోకి దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఆదివారం జరిగిన ఈ ఘటనను ఎస్సై డి.సురేష్‌బాబు స్థానిక విలేకరులకు వివరించారు. రాయవరం గ్రామానికి చెందిన కొండపల్లి అచ్చియ్యమ్మ (80) అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. లొల్లలో హోమియో మందులకని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన అచ్చియ్యమ్మ మందులు తీసుకుని, ఇంటికి రాకుండా మాచవరం వెళ్లి కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు పంపించినట్లు తెలిపారు.

కొంతమూరులో చోరీ

- 18 కాసుల బంగారం.. 3.5 కిలోల వెండి అపహరణ


చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న పోలీసులు

రాజానగరం: స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలోని రాజమహేంద్రవరం రూరల్ మండలం, కొంతమూరులోని ఒక ఇంటిలో చోరీ జరిగింది. స్థానిక సీఐ వీరయ్యగౌడ్ తెలిపిన వివరాలిలా వున్నాయి. కొంతమూరుకు చెందిన గరిమెళ్ల పవన్‌కుమార్‌శర్మ కుటుంబ సమేతంగా ఈనెల 15న ఇంటికి తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లి ఆదివారం తిరిగి వచ్చారు. అయితే వేసిన తాళం పగుల గొట్టి ఉండటంతో కంగారుగా లోనికి వెళ్లి చూస్తే బీరువాలో దాచుకున్న 18 కాసుల బంగారు నగలు, 3.5 కిలోల వెండి వస్తువులు, రూ.10 వేల నగదు అపరణకు గురైనట్టు గ్రహించారు. వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్‌ను, డాగ్ స్క్వాడ్‌ని రప్పించారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పులస @ రూ.22 వేలు


పులసను సొంతం చేసుకున్న రత్నం

యానాం: మాంసాహార ప్రియులు అత్యంత ఇష్టంగా తినే పులసల సీజన్ యానాంలో మొదలైంది. స్థానిక గౌతమి గోదావరిలో మత్స్యకారుల వలకు సుమారు రెండు కిలోల బరువున్న పులస చిక్కింది. వేలంపాటలో స్థానిక మత్స్యకార దంపతులు పొన్నమండ భద్రం, రత్నం దంపతులు రూ.22 వేలకు దక్కించుకున్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

అనపర్తి: వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును దుండగుడు అపహరించిన ఘటన ఆదివారం అనపర్తిలో జరిగింది. స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంతంలో నివాసం ఉంటున్న 80 ఏళ్ల వృద్ధురాలు కర్రి ఆదిలక్ష్మి ఇంట్లో నుంచి చెత్తను పారవేయడానికి బయటకు రాగా గుర్తు తెలియని దుండగుడు ఆమె మెడలోని గొలుసును లాక్కుని మోటార్ సైకిల్‌పై పరారయ్యాడు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై ఎల్.శ్రీను నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఉద్యానానికి నైరుతి ఊతం

- కూరగాయల సాగుకు రైతులు సమాయత్తం
- రాయితీపై విత్తనాల కోసం ఎదురుచూపు
- విత్తన శుద్ధితో మేలైన దిగుబడులు
- సూచనలు పాటించాలంటున్న అధికారులు

అలమూరు: వాతావరణ పరిస్థితులతో ఇప్పటి వరకూ వేసవి తీవ్రతను మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఉద్యాన రైతులు కూరగాయల సాగుకు ధైర్యం చేయలేదు. నైరుతి రుతు పవనాల ప్రభావం, బంగాళఖాతంలో అల్పపీడన ద్రోణి కారణాలతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతుల్లో ఆశలు చిగురించి ఉద్యాన పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. ఉష్ణ వాతావరణాన్ని తట్టుకోవడంతో పాటు నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉన్న లంక మట్టి నేలలు కూరగాయల సాగుకు అనుకూలం. ఉద్యాన శాఖ సూచనలకు అనుగుణంగా యాజమాన్య పద్ధతులు, మెళకువలు పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిగ దిగుబడులు సాధించవచ్చు. ఈ సమయంలో ఏయే పంటలు సాగు చేయవచ్చు, విత్తనాల కొనుగోలు, తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వ్యవసాయ శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు.

హెక్టారుకు రూ.మూడు వేల రాయితీ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 3.75 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగుచేస్తుండగా కేవలం 38 వేల ఎకరాల్లో మాత్రమే కూరగాయలు సాగు చేస్తున్నట్లు ఉద్యానశాఖ గణాంకాలు చెబుతున్నాయి. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ఉద్యానశాఖ మేలైన విత్తనాల కొనుగోలుకు హెక్టారుకు రూ.మూడు వేల వరకు రాయితీపై అందజేస్తోంది. కూరగాయల రైతు విత్తనాలు కొనుగోలు చేసిన రశీదుతో పాటు కూరగాయల సాగు చేస్తున్న భూమి వివరాలతో కూడిన దరఖాస్తులను గ్రామ ఉద్యాన శాఖ అసిస్టెంట్ల ద్వారా జిల్లా కార్యాలయాలకు పంపించాలి. దీంతో సంబంధిత జిల్లా కార్యాలయాలైన కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం కేంద్రాల్లో డీహెచ్‌ఓలు పరిశీలిస్తారు. అనంతరం విత్తనాల రాయితీ సొమ్ము నేరుగా రైతు ఖాతాలోకే జమవుతుంది. వంగ, క్యాబేజీ, కాలీఫ్లవర్ నారును ఉద్యానశాఖ సూచనల మేరకు రైతులే తయారు చేసుకుంటే పెట్టుబడి ఆదా అవుతుంది.

విత్తే ముందు జాగ్రత్తలు ఇలా..

కూరగాయల సాగుకు తొలుత విత్తన శుద్ధి తప్పనిసరి. కిలో విత్తనానికి మూడు గ్రాముల థైరమ్, ఐదు గ్రాముల ఇమిడా క్రోఫిన్ మందును ఒక దాని తరువాత మరొకటి కలిపి విత్తన శుద్ధి చేస్తే కూరగాయ మొక్కలకు తెగుళ్లను తట్టుకునే శక్తి ఉంటుంది. విత్తే ముందు ఎకరానికి ఆరు టన్నుల పశువుల ఎరువు, 35 కిలోల భాస్వరం, 18 కిలోల పొటాష్ మిశ్రమాన్ని విత్తన గుంటల్లో వేయాలి. విత్తిన 25 నుంచి 30 రోజుల్లో లేదా పిందె దశలో సుమారు 30 కిలోల నత్రజనిని రెండు సమపాళ్లుగా చేసి మొక్కలకు అందించాలి. కూరగాయల సాగు వేయాలని నిర్ణయం తీసుకుంటే ముందుగా వేసవిలోనే దుక్కి దున్ని ఉంచుకుంటే మంచి ఫలితం ఉంటుంది. కలుపు మొక్కలు లేకుండా ఉద్యాన రైతులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి.

సాగులో సంభవించే తెగుళ్లు ఇవీ

కూరగాయల సాగులో సాధారణంగా ఏటా గుమ్మడి పండు పురుగు, పొట్లాకు పురుగు, పండు ఈగ, బూజు తెగులు, బూడిద తెగులు, రసం పీల్చే పురుగు, పాముపొడ పురుగు, ఆకుపచ్చ తెగులు సంభవిస్తుంటాయి. ఉద్యాన శాఖ పర్యవేక్షణలో అధికారుల సలహా మేరకు సరైన సస్యరక్షణ చర్యలు తీసుకుని కూరగాయల పంటను సాగుచేస్తే సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. పరిమితంగా పురుగు మందులను వినియోగిస్తూ సంప్రదాయబద్ధంగా తయారు చేసుకునే ఎరువులను వినియోగిస్తే తెగుళ్ల బెడద చాలా వరకూ తగ్గుతుంది. తేలికగా సాగు చేసే తీగజాతి కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారిస్తే తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుంది.


ఏపుగా పెరిగిన పచ్చి మిరప

ఈ రకాలైతే మేలైన ఉత్పత్తి


జూలై నుంచి సెప్టెంబర్ వరకూ పందిరి కూరగాయలైన సొర, బీర, ఆనప, కాకర, పొట్ల, దోస, గుమ్మడి, బూడిద గుమ్మడితో పాటు వంగ, బెండ, టమోటా తదితర రకాలను సాగు చేసి అధిక దిగుబడులను సాధించవచ్చు. అన్ని సీజన్లలో వివిధ వాతావరణ పరిస్థితులను తట్టుకునే దొండ సాగును ఏడాది పొడువునా సాగు చేసుకునే అవకాశం ఉంది. ఆనప, బీర, పొట్ల, కాకర పంటను పందిరిపై పెంచితే మంచి నాణ్యత కలిగిన దిగుబడి వచ్చి అధిక లాభాలు పొందే అవకాశం ఉంటుంది. మెట్ట ప్రాంతంలో మొక్కజొన్న, కర్ర పెండలం, డెల్టా ప్రాంతంలో వాణిజ్య పంటలకు అనుకూలంగా ఉంటుంది.


విరగకాసిన టమోటా


బడుగువానిలంకలో వంకాయలు కోస్తున్న రైతులు


మూలస్థాన అగ్రహారంలో పందిరి దొండ సాగు

కూరగాయల సాగులో జాగ్రత్తలు తప్పనిసరి



కూరగాయల సాగులో రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. తేలికగా సాగు చేసే తీగ జాతి కూరగాయలపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలి. కూరగాయల సాగుకు హెక్టార్‌కు ఇస్తున్న రూ.మూడు వేలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– డీవీ రమణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి, అమలాపురం


ర్యాలిలో పందిరి కాకర తోట

ఫెన్సింగ్ సంఘం అధ్యక్షురాలిగా సుగుణారెడ్డి



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ ఫెన్సింగ్ సంఘం అధ్యక్షురాలిగా ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్.సుగుణారెడ్డి నియమితులయ్యారు. కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. సంఘం కార్యదర్శిగా గుణ్ణం కృష్ణమోహన్ (పశ్చిమ గోదావరి), కోశాధికారిగా ఆకుల చంద్రకళావతి (కడప), ఉపాధ్యక్షురాలిగా కె.సూర్యలక్ష్మీదేవి (గుంటూరు), సహాయ కార్యదర్శిగా జి.నవీన్ (ప్రకాశం), కార్యవర్గ సభ్యులిగా నంద్యాల రాధిక (కర్నూల్), డి.అశోక్ (గుంటూరు) ఎంపికైయారు. పరిశీలకులుగా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుండి అశోక్‌దుదారే వి.సతీష్ (కాకినాడ డీఎస్ఏ వెయిట్ లిఫ్టింగ్ కోచ్), మెంటర్ నాగం సతీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి అభినందించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	29,500
గటగట (వెయ్యి)	27,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	28,000
గటగట (వెయ్యి)	25,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ఆధ్యాత్మిక సేవల్లో ఆర్యవైశ్యులు ముందంజ


ఆర్య వైశ్య సంఘ జిల్లా కమిటీ ప్రతినిధుల ప్రమాణ స్వీకారం

- మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ

సామర్లకోట: ఎక్కడ ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు జరిగినా అక్కడ ఆర్యవైశ్యులు ఉంటారని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి మందిరంలో నిర్వహించిన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్యవైశ్యులు ఐక్యతతో అన్ని రంగాలలో ముందంజలో ఉండాలన్నారు. అర్యవైశ్యుల కమిటీల్లోని ప్రతినిధులు సంఘాల ఆశయాలు నెరవేర్చాలన్నారు.

జిల్లా సహాయ కార్యదర్శిగా చినవీర్రాజు

ఆర్యవైశ్య సంఘాల కమిటీల ప్రమాణ స్వీకారంలో భాగంగా సామర్లకోట నుంచి జిల్లా కమిటీకి కటకం చిన వీర్రాజు ఎన్నికయ్యారు. అలాగే జిల్లా కమిటీలో ఉపాధ్యక్షునిగా కటకం సుజన్, యువజన విభాగం కన్వీనర్‌గా చోడిశెట్టి నవీన్, వాణిజ్య విభాగం కన్వీనర్‌గా సంకా వీరవెంకట కామేశ్వర గుప్తా, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కంచర్ల నాగేశ్వర రావు, కంచర్ల మల్లిబాబు, కారుమూరి పవన్, పేకేటి రమేష్, గ్రంధి రాము, కూరగాయల గొల్లబాబు, కంచర్ల సత్తిబాబు, అర్బన్ పీఆర్వోగా కంచర్ల వినయ్ ఎన్నిక అయ్యారు. జిల్లా అధ్యక్షుడు పులవర్తి కుమార్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.

ప్రభుత్వ నిరంకుశత్వానికి పరాకాష్ట మిథున్‌రెడ్డి అరెస్టు

- ఎమ్మెల్సీ ఇజ్రాయిల్


ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: వైఎస్సార్ సీపీ లోక్‌సభాపక్ష నేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అక్రమ మద్యం కేసులో అరెస్టు చేయడం కూటమి ప్రభుత్వ నిరంకుశత్వానికి పరాకాష్ట అని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతున్నందున కూటమి ప్రభుత్వం అక్రమ కేసులకు పాల్పడుతూ అరెస్టు చేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీకి వస్తున్న మద్దతును చూసి ఓర్వలేక దుర్మార్గాలకు పాల్పడుతోందని ఇజ్రాయిల్ దుయ్యబట్టారు. 2014 నుంచి 19 వరకు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మద్యం దోపిడీలో రూ.25 వేల కోట్లు అవినీతికి పాల్పడ్డారని సీఐడీ దర్యాప్తులో తేలిందని, ఇప్పటికీ ఈ కేసులో చంద్రబాబునాయుడు బెయిల్‌పై ఉన్నారని తెలియజేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు ఏర్పాటుచేసి మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని, కొంత మంది టీడీపీ నాయకులు అక్రమ మద్యం తయారుచేసి నేరుగా మద్యం షాపుల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ హయాంలో జరగని కుంభకోణాన్ని జరిగినట్లుగా చిత్రీకరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఇజ్రాయిల్ తెలిపారు. అక్రమ అరెస్టులు, కక్ష సాధింపు చర్యలు రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగమేనని ప్రజలందరూ ఈ పరిణామాలను గమనిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి గాలికి వదిలేసి ఇటువంటి చర్యలకు పాల్పడడం చాలా దుర్మార్గమని, వరుస పెట్టి వైఎస్సార్ సీపీ నాయకులకు అక్రమ కేసుల్లో ఇరికించి అరెస్టు చేయడం ద్వారా వైఎస్సార్ సీపీని భూస్థాపితం చేయాలని కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఇజ్రాయిల్ తెలిపారు. ఎంతమందిని అరెస్టు చేసినా పార్టీకి కార్యకర్తలు అండగా ఉన్నంతకాలం వైఎస్సార్ సీపీని ఎవరూ ఏమీ చేయలేరని తెలియజేశారు.

కోళ్లను మింగిన నల్లతాచు

- వాటిని కక్కించి సురక్షిత ప్రాంతంలో వదలిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ


కోళ్లను మింగిన నల్లతాచును పట్టుకున్న స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ

అమలాపురం రూరల్: మండలంలో జనిపల్లి గ్రామంలో ఆరడుగుల తాచుపాము నాలుగు కోళ్లను మింగేసింది. బాలయోగి ఘాట్ వద్ద ఉన్న మారిశెట్టి నాగభూషణం ఇంటి ఆవరణలోకి ఆదివారం ఆరడుగుల నల్లతాచు ప్రవేశించింది. అక్కడే ఉన్న నాలుగు కోళ్లను మింగి కదలలేని స్థితికి చేరింది. నాగభూషణం భయపడి ఉప్పలగుప్తం మండలం భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ జంపన గణేష్‌వర్మకు సమాచారం ఇచ్చారు. వర్మ అక్కడకు చేరుకుని అతి కష్టం మీద నాలుగు కోళ్లను కక్కించి పామును డబ్బాలో బంధించి సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాకాలం తమ ఆవాసాలను కోల్పోయిన పాములు ఆహారం నీటి కోసం నివాస గృహాల వైపు వస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఇళ్ల చుట్టూ ఉన్న తుప్పలను పొదలను తొలగించి పరిసరాలు శుభ్రంగా ఉంచితే పాములు రావని ఆయన అవగాహన కల్పించారు.

జల్సాలకు బానిసై గంజాయి దందా


నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు

- పోలీసుల దాడిలో మైనర్‌తో పాటు ఐదుగురి అరెస్టు

కడియం: మండలంలోని కడియపులంక శ్మశాన వాటిక వద్ద గంజాయి విక్రయాలు సాగుతున్నాయన్న సమాచారంతో ఆదివారం చేసిన దాడిలో ఒక బాలుడితో పాటు, ఐదుగురు యువకులను అరెస్టు చేసినట్లు కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. హుకుంపేట, బొమ్మూరు ప్రాంతాలకు చెందిన వీరంతా ఏజెన్సీ ప్రాంతమైన కేడీ పేట నుంచి గంజాయిని తీసుకువచ్చి, చిన్నపొట్లాలుగా మార్చి కడియపులంక ప్రాంతంలో విక్రయిస్తున్నారన్నారు. వీరి నుంచి రూ.15 వేల విలువైన 3.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే రాజానగరం, రాజవొమ్మంగి, గండేపల్లి, తణుకు, బొమ్మూరు, ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీ చేసిన ఆరు మోటారు సైకిళ్లను కూడా వారి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. చెడు వ్యసనాలకు బానిసలై, జల్సాల కోసం వీరంతా చోరీల బాట పట్టారని వేంకటేశ్వరరావు తెలిపారు. వీఆర్వో సమక్షంలో ప్రాథమిక దర్యాప్తు అనంతరం వీరిని కోర్టుకు తరలించినట్లు వివరించారు. ఈ దాడుల్లో కడియం ఎస్ఐ బీఎన్‌డీ ప్రసాద్, హెచ్‌సీలు రవికాంత్, శ్రీను, పీసీలు ప్రసాద్, శ్రీను, సాయి పాల్గొన్నారన్నారు.

స్మార్ట్ మీటర్లపై అపోహలు వద్దు

- ఏపీ ఈపీ డీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



సాక్షి, విశాఖపట్నం: స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విషయంలో ఎలాంటి అపోహలు అవసరం లేదని, వీటితో వినియోగదారులపై అదనపు భారం ఉండే అవకాశమే లేదని ఏపీ ఈపీ డీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ అంశంలో వస్తున్న వదంతులపై ఆయన స్పందిస్తూ.. ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారుల సేవల్లో పారదర్శకతను మరింత పెంచేందుకు ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు జరుగుతోందని పేర్కొన్నారు. ఏపీ ఈఆర్సీ రెగ్యులేషన్ ప్రకారం ప్రభుత్వ, వాణిజ్య కేటగిరీల వినియోగదారులకు ప్రస్తుతం వీటిని అమర్చుతున్నామన్నారు. వీటితో పాటు ఎక్కువ విద్యుత్ వినియోగం కలిగిన (హై వేల్యూ) గృహ వినియోగదారులకు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ మీటర్ ఏర్పాటు సమయంలో వినియోగదారులు వాటి ఖరీదు, చార్జీలు కానీ, మామూళ్లు కానీ చెల్లించాల్సిన అవసరం లేదని సీఎండీ తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల వినియోగదారులపై విపరీత భారాలు పడతాయనే ఆందోళన అవసరం లేదన్నారు. స్మార్ట్ మీటర్లు పాత మీటర్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగాన్ని నమోదు చేయవని, వీటి వల్ల బిల్లులు పెరిగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాత మీటర్లతో పోలిస్తే స్మార్ట్ మీటర్ల ద్వారా మరింత పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. ఏపీ ఈఆర్సీ నిర్ణయించిన టారిఫ్ ప్రకారమే విద్యుత్ బిల్లులు వసూలు చేస్తామని పేర్కొన్నారు. బిల్లు వివరాలను నేరుగా వినియోగదారుని మొబైల్‌కు చేరవేస్తామని చెప్పారు. వినియోగం, ఖర్చుపై పూర్తి నియంత్రణ వినియోగదారుల చేతుల్లో ఉండడం వలన విద్యుత్ వినియోగాన్ని మెరుగ్గా ప్లాన్ చేయడంలో స్మార్ట్ మీటర్లు సహకరిస్తాయన్నారు. ఈ విషయంలో ఎలాంటి సందేహం ఉన్నా.. టోల్ ఫ్రీ నం 1912లో సంప్రదించాలని సీఎండీ పృథ్వీతేజ్ ప్రకటనలో సూచించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

- ఇద్దరిపై ముగ్గురు వ్యక్తుల దాడి
- నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు

అమలాపురం టౌన్: ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేశారన్న ఆగ్రహంతో ఇద్దరి వ్యక్తులపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. దాడికి గురైన అయినవల్లి మండలం వెలవలపల్లికి చెందిన దోనిపాటి మహేష్, అమలాపురం మున్సిపాలిటీ మాజీ ఉద్యోగి ఉదయ్ శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. శనివారం రాత్రి 7.30 గంటల సమయంలో యల్లమిల్లి విజయ్, కృష్ణ, మహేష్ పేరూరు వై.జంక్షన్‌లో దోనిపాటి మహేష్, ఉదయ్ శంకర్‌లను ఆటో ఎక్కించుకుని తొలుత అమలాపురం పట్టణంలోని ఆమని మొబైల్స్ వద్ద గల తోటలోనూ, తర్వాత అల్లవరం మండలం దేవరలంకలో రెండు సార్లు దాడి చేశారని వారు పేర్కొన్నారు. రావులపాలెం శ్రీశాంతి ఒకేషనల్ కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్న దోనిపాటి మహేష్ ఉద్యోగాలు ఇప్పించే విషయంలో మధ్యవర్తిత్వం వహించగా అమలాపురం మున్సిపాలిటీ మాజీ ఉద్యోగి ఉదయ్ శంకర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పడంతో విజయ్, కృష్ణ, మహేష్ రూ.6.7 లక్షలు వరకూ ఇచ్చారని, ఎంతకీ ఉద్యోగాలు ఇప్పించకపోవడం, ఇచ్చిన డబ్బు వాపసు ఇవ్వకపోవడంతో వారిపై దాడి ఈ ముగ్గురూ దాడికి పాల్పడ్డారని సీఐ వీరబాబు తెలిపారు. దాడిలో గాయపడిన దోనిపాటి మహేష్, ఉదయ్ శంకర్ ప్రస్తుతం అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులను డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ ఆదివారం రాత్రి విచారించారు. వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ కూడా ఏరియా ఆస్పత్రిలో బాధితులను కలిసి వారికి సంఘీ భావం తెలిపారు. మంత్రి వాసంశెట్టి శుభాష్ తమకు బాగా తెలుసునని చెప్పి మరీ దోనిపాటి మహేష్, ఉదయ్ శంకర్‌లపై దాడి చేశారని బొంతు రమణ ఓ ప్రకటనలో తెలిపారు.